క్లుప్తంగా

హోరాహోరీగా వాలీబాల్ ఫైనల్ పోటీ



ఫైనల్‌లో తలపడుతున్న జట్లు

ఏలూరు రూరల్: ఏలూరులో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవం ఆదివారం ముగిసింది. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈషా రూరల్ ప్రీమియర్ లీగ్ పేరుతో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. స్థానిక సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ పోటీల్లో ఏలూరు జిల్లా నుంచి 24 జట్లు పాల్గొన్నాయి. రెండురోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో చింతలపూడి స్పైకర్స్ జట్టుతో కొప్పాకగూడెం అంబేడ్కర్ జట్టు తలపడింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో 22-25, 15-25 స్కోర్‌తో చింతలపూడి జట్టు విజయం సాధించింది. తాడినాడ జట్టు మూడోస్థానం, నరసాపురం జట్టు నాల్గోవ స్థానంలో నిలిచాయి. ఈ పోటీలు క్రీడాభిమానులను అలరించాయి.

గొడ్డలితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

పెదపాడు : ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసి గాయపర్చిన ఘటనలో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తిపై ఆదివారం పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని వసంతవాడకు చెందిన తట్టు కూరి కాసులు మాజీ సర్పంచ్ పులవర్తి అంకరాజు పొలంలో వ్యవసాయ పనులకు వస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలో అంకరాజు కుమారుడు శ్రీనివాసరావును డబ్బులు కావాలని అడిగా డు. తనకు ఇవ్వకుండా వేరొకరికి డబ్బులు ఇచ్చాడనే అక్కసుతో గొడ్డలితో దాడి చేసి కాలి పాదంపై వేటు వేసాడు. దీంతో పాదం ఊడిపోయేలా గాయం కావడంతో క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉన్నత వైద్యం నిమిత్తం అతడిని విజయవాడకు తరలించారు. శ్రీనివాసరావు కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వా చెరువులకు అక్రమ విద్యుత్ కనెక్షన్లు

- తిమ్మారావుగూడెంలో 110 ఎకరాల్లో ఆక్వా సాగు
- చెరువులకు అడ్డదారుల్లో విద్యుత్ వినియోగం
- పట్టించుకోని అటవీశాఖ, విద్యుత్ శాఖాధికారులు
- విద్యుత్ కనెక్షన్ గృహానికి.. వినియోగం చెరువులకు



తిమ్మారావుగూడెం చెరువుపైకి అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు



తిమ్మారావుగూడెం అభయారణ్యంలోని అక్రమ ఆక్వా చెరువు

ఏలూరు రూరల్: అభయారణ్యం పరిధిలో ఏలూరు రూరల్ మండలం, తిమ్మారావుగూడెం పరిసర ప్రాంతాల్లోని ఆక్వా చెరువులకు యథేచ్ఛగా అక్రమంగా విద్యుత్ సరఫరా కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో తవ్విన చెరువులకు అక్రమార్కులు అడ్డదారుల్లో విద్యుత్ కనెక్షన్లు కలిపారు. రాత్రి, పగలూ తేడా లేకుండా నిరంతరం విద్యుత్ వాడుతూ చేపలు, రొయ్యల సాగు చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. అటవీశాఖ, ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది ఈ అక్రమాలను చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. ఇటీవల అటవీశాఖ ఏలూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌తో పాటు పదుల సంఖ్యలో సిబ్బంది ఈ ప్రాంతంలో అక్రమ చెరువులను సందర్శించినప్పటికీ విద్యుత్ కనెక్షన్లపై కన్నెత్తి కూడా చూడలేదు.

అడ్డదారుల్లో కనెక్షన్లు

కొంతకాలం క్రితం తిమ్మారావుగూడెం పరిసరాల్లో సుమారు 110 ఎకరాల విస్తీర్ణంలో నాలుగు భారీ చెరువులు తవ్వారు. సొసైటీల ఆధీనంలో ఉన్న ఈ చెరువులను బడాబాబులు లీజుకు తీసుకున్నారు. ఏటా ఎకరానికి రూ.65 వేల నుంచి రూ.80 వేల వరకూ లీజు చెల్లిస్తున్నారు. అభయారణ్యంలో ఉన్నందున ఈ చెరువులకు దొడ్డిదారిన విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్నారు. తిమ్మారావుగూడెం పరిసరాల్లోని ఓ చెరువుకు పక్కనే ఉన్న డాక్టర్ కాంచనమాలకు చెందిన పట్టా భూమి గల చెరువు గట్టుపై నుంచి అక్రమంగా కరెంట్ తీగలు లాగారు. మరోపక్క మొండికోడు గట్టు పక్కన ఉప్పరపేటలో పదికి పైగా కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇంటికి కనెక్షన్ కావాలంటూ ట్రాన్స్‌కో అధికారులను దరకాస్తు చేసి మీటర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ మీటర్ నుంచి నేరుగా అక్రమ చెరువు గట్లపైకి సుమారు 100 నుంచి 200 మీటర్ల దూరం తీగలు లాగారు. వీటి ద్వారా నీటిని తోడే మోటార్లు, గాలి పంకాలు తిప్పుతున్నారు. మొండికోడు కనకదుర్గ గుడి వెనుక పక్క సుమారు ఏడు అక్రమ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకుని చెరువుల్లో చేపలు, రొయ్యల సాగు చేస్తున్నారు.

పేదల గోడు పట్టించుకోని అధికారులు

అక్రమ కనెక్షన్ల ద్వారా చెరువులకు పెద్ద ఎత్తున విద్యుత్ వినియోగించడంతో స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. విద్యుత్ హెచ్చుతగ్గులు ఏర్పడి టీవీ, ఫ్రిజ్ పాడైపోతున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నా అధికారుల నుంచి స్పందన కరువైంది. పలుసార్లు అటవీశాఖ అధికారులు, సిబ్బందికి వారు లోఓల్టేజీ సమస్యపై ఫిర్యాదు చేసారు. దీంతో అక్రమార్కులు మొదటికే మోసం వస్తుందని భయపడి, ట్రాన్స్‌కో అధికారుల ద్వారా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్నారు.

నిబంధనలకు నీళ్లు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అభయారణ్యంలో అక్రమ చెరువులు తవ్వరాదు. ఎలాంటి విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకోకూడదు. అక్రమార్కులు అధికారులను లోబర్చుకుని అక్రమ మార్గంలో కనెక్షన్లు పొందుతున్నారు. తక్కువ కరెంట్ బిల్లులు చెల్లిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

పరిశీలన అనంతరం చర్యలు



తిమ్మారావుగూడెం పరిసర అభయారణ్యంలో అక్రమ చెరువుల వ్యవహారం మా దృష్టికి వచ్చింది. అభయారణ్యంలో అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఒక్కొక్కటీ పరిశీలిస్తున్నాం. ఇటీవల తిమ్మారావుగూడెంలో చేపల పట్టుబడిపై రేగిన వివాదం సందర్భంగా ప్రాంతాన్ని పరిశీలించాం. త్వరలో పూర్తిస్థాయిలో పరిశీలన అనంతరం చర్యలు తీసుకుంటాం.

– సోమరాజు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, ఏలూరు

నేత్ర సమస్యలపై అప్రమత్తంగా ఉండండి



నేత్ర పరీక్షలు చేస్తున్న సాంకేతిక నిపుణులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేత్ర సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, కళ్లకు ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే వైద్యుని సంప్రదించి చికిత్స పొందడం ద్వారా కంటి చూపు కోల్పోకుండా జాగ్రత్తపడాలని లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు సూచించారు. ఆదివారం స్థానిక అగ్రహారంలోని గీతా భవనంలో మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు పేదలకు నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా 14 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి శస్త్ర చికిత్స చేయడానికి నేత్ర వైద్యశాలకు తరలించారు. మరో 32 మందికి కళ్లజోళ్లను సబ్సిడీ ధరలకు అందజేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నా వెంకటరామయ్య, పరస శ్రీనివాసరావు, పిల్లి పండరీనాథ్, వనిమిశెట్టి రామారావు పాల్గొన్నారు.

పేదలకు 3 సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలి

ఏలూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం మూడు సెంట్ల స్థలం అందించాలని బీకేయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేసారు. ఆదివారం చాటపర్రు గీతాకాలనీ గట్టుపై ఇల్లు లేని పేదలను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ పార్టీ సంయుక్తంగా ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా పేదలతో కలిసి స్థానిక సచివాలయాల్లో ఇళ్ల స్థలాల అర్జీలు అందజేత కార్యక్రమం చేపడతామన్నారు. ప్రభుత్వం పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తానని వాగ్దానం చేసిందన్నారు. నేటి పరిస్థితుల్లో రూ.4 లక్షలతో ఇల్లు నిర్మాణం సాధ్యం కాదన్నారు. దీన్ని గుర్తించి ప్రభుత్వం ప్రతి పేదవాడికీ రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేసారు. సిమెంట్, ఇసుక, కంకర, ఐరన్ సైతం ప్రభుత్వమే పూర్తి ఉచితంగా అందించాలన్నారు. ఈ సందర్భంగా పేదలతో అర్జీలు రాయించారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాట్టేలు పెంటయ్య, బుగ్గల ప్రభాకర్, అరిగెల యోహాన్, కె.నాగరాజు తదితరులు ఉన్నారు.



చాటపర్రులో ఇల్లు లేని పేదలతో మాట్లాడుతున్న నాయకులు

పట్టణ ప్రాంతాల్లో రెండు సెట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): పట్టణ ప్రాంతాల్లో పేదలకు 2 సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో 1వ డివిజన్ నందు ఇళ్ల స్థలాల కేటాయింపులు పెంపుదల అర్జీల నమోదు కార్యక్రమం అడ్డగర్ల లక్ష్మీ ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను నెరవేర్చి పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలని అన్నారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పట్టాలు పొందిన లబ్ధిదారుల నుంచి అర్జీలను సేకరించి నవంబర్ 18న గ్రామ వార్డు సచివాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. అర్జీలను ప్రభుత్వానికి ఇచ్చే కార్యక్రమం ఏలూరు నగరంలో నిర్వహిస్తున్నామని ప్రజలంతా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, సమితి సభ్యులు ఉప్పులూరి రవి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు ప్రెసిడెంట్‌గా రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు రూరల్: ఏలూరు మార్కెట్ యార్డు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రెడ్డి అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మార్కెట్‌యార్డులో హమాలి వర్కర్స్ యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. హమాలీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు వెంకటేశ్వరరావు ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. కోశాధికారిగా మీసాల రమణ ఏకగ్రీమయ్యారని వివరించారు. సంయుక్త కార్యదర్శి ఎన్నికల్లో యర్రా శ్రీనివాసరావు సమీప అభ్యర్థి మంగరాజుపై 74 ఓట్లు తేడాతో గెలుపొందారని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే పోలారి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధానాలు అమలు చేస్తోందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏలూరు నగర కమిటీ సభ్యుడు జి రాంబాబు, మంగం అప్పారావు, దూళ్ల వీరినాయుడు, నాగేశ్వరరావు, అన్నవరం, భూపతి, కాకర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డు ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పాలక సంస్థ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, ఇంజనీరింగ్ విభాగం కార్మికుల జీతాల పెంపుదల కోసం దశల వారి ఆందోళన చేపట్టాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఏలూరు నగర కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. యూనియన్ అధ్యక్షుడు లావేటి కృష్ణారావు అధ్యక్షతన కమిటీ సమావేశం ఆదివారం పవరుపేట సీఐటీయూ ఆఫీసులో నిర్వహించారు. సమావేశం వివరాలను కార్యదర్శి ఏ.జాన్ బాబు వెల్లడించారు. ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు జీతాల పెంపుదల కోసం వచ్చే నెల మొదటి వారం నుంచి దశల వారీ ఆందోళనకు యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని, దీనిలో భాగంగా ఏలూరులో నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు బి. సోమయ్య కోరారు. విజయవాడ వరదల్లో సేవలందించిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రెండు జతల యూనిఫారం, కుట్టు కూలీలు, మాస్కులు, గ్లౌజులు వెంటనే ఇవ్వాలని సమావేశం కోరింది. సర్వీస్‌లో ఉండగా చనిపోయిన వారి వారసులకు ఉద్యోగాలు, రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సమావేశంలో నాయకులు కోరారు. కార్మికుల పని చేయడానికి కావలసిన పనిముట్లు, డబ్బాలు, తోపుడు బండ్లు ఏర్పాటు చేయాలని సమావేశం కోరారు. ఈనెల 20న నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో ప్రవీణ్, ఏసురత్నం, పంతం చిన్న నాగరాజు, జార్జి, బంగారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై ఉంగుటూరు వద్ద ఆదివారం రాత్రి నడిచి వెళుతున్న ఆర్.నాగరాజును కైకరం వైపు వెళుతున్న మోటారు సైక్లిస్టు ఢీకొట్టాడు. కె.పెంటపాడుకు చెందిన ఆర్ నాగరాజు కాలినడకన ద్వారకా తిరుమల వెళుతున్నాడు. నాగరాజు ఉంగుటూరు దాటే సరికి తాడేపల్లిగూడెం నుంచి కైకరం వైపు మోటారుసైకిల్‌పై వెళుతున్న కైకరం గ్రామానికి చెందిన ఆకుల సునీల్, రవి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దాంతో నాగరాజు తలకు బలమైన గాయమైంది. మోటార్ సైకిల్‌పై వెళుతున్న సునీల్, రవిలకు గాయాలయ్యాయి. వీరందరినీ హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారంతా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

జోరుగా గుట్కా విక్రయాలు

- అమలుకాని నిషేధాజ్ఞలు
- లాభపడుతున్న వ్యాపారులు

పెదవేగి : గుట్కా విక్రయాలపై విధించిన నిషేధాజ్ఞలు ఎక్కడా అమలు కావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా కిళ్లీ షాపుల్లో, కిరాణా బడ్డీలపై గుట్కా విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాల్లో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రతి కిళ్లీ బడ్డీలో పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా విక్రయాలు సాగుతున్నాయి. దానిపై ఉన్న రేటు కన్నా అధిక ధరలకు విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. వాటిని తిని ప్రజలు ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు. ఒడిస్సా, కోల్‌కతా వంటి ప్రాంతాల నుంచి ఏలూరుకి అక్కడి నుంచి నియోజకవర్గంలోకి అన్ని గ్రామాలకు ఈ గుట్కా ప్యాకెట్లు దిగుమతి అవుతున్నట్లు సమాచారం. వీటితో పాటు అనుమతులు లేని పలు రకాల సిగరెట్లు కూడా ఇబ్బడి ముబ్బడిగా దిగుమతి అవుతున్నాయి. కొన్ని గుట్కా ప్యాకెట్లపై తయారీదారుల వివరాలు కూడా ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు. పొగాకు ఉత్పత్తులు సేవించడం పూర్తిగా మానేయాలని, గుట్కాలు, ఖైనీలు సమలడం వల్ల దంత క్యాన్సర్ ఇతర వ్యాధులు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని పెదవేగి పీహెచ్‌సీ వైద్యులు పి పూర్ణిమ అన్నారు. దీనిపై ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలను దుకాణాల్లో విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	03
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	13
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	22
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	92
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	32-56	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	80
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	60
కాకర కాయలు	34	కీరా దోస	34
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	34	అల్లం	80
క్యాబేజీ	32-40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	60	పాలకూర	15
దొండకాయలు	32	చుక్కకూర	15
బంగాళదుంపలు	38	తోటకూర	15
ఉల్లిపాయలు	38-55	గోంగూర	07
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

వెంటాడుతున్న కూలీల కొరత

- నానాటికీ పెరుగుతున్న కూలి రేట్లు
- రైతులపై పెరుగుతున్న పెట్టుబడి భారం
- వేధిస్తున్న ఆధునిక వ్యవసాయ యంత్రాల కొరత



భోగాపురంలోలో వరి కోతలు కోస్తున్న కూలీలు

పెదవేగి : ఒక పక్క రోజుకో రకంగా మారుతున్న వాతావరణం సార్వా మసూళ్లు చేపట్టిన రైతులను భయపెడుతోంది. మరో పక్క వ్యవసాయ పనులు వేగవంతమయ్యేందుకు అవసరమైన ఆధునిక యంత్రాలు, కూలీలు అందుబాటులో లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో కూలీలతో మాసూళ్లు చేసేందుకే అధిక శాతం రైతులు మొగ్గుచూపుతున్నారు. దెందులూరు నియోజవర్గంలో ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగాఉంది. దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లో వరి కోతలు చాలావరకు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలోని సుమారు 25వేల ఎకరాల్లో వరి పంట మరో నాలుగు రోజుల్లో కోతకు రానుంది. దీంతో కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దీనికి తోడు గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టడంతో కూలీలు లభ్యం కాకపోవడంతో రైతులు తలలు పట్టుకుని పట్టుకుంటున్నారు. ఇందుకు అనుగుణంగానే కూలీ రేట్లు కూడా పెరిగాయి. మామూలు రోజుల్లో ఆడవారికి రూ.200, మగవారికి రూ.300 కూలి ఉంది. వరి కోతల సమయంలో ఆడ కూలీలకు రూ.400, మగవారికి రూ.500 చెల్లించాల్సి వస్తోందని రైతులు తెలిపారు. అంత మొత్తం చెల్లించడానికి సిద్ధపడినప్పటికీ కూలీలు లభ్యం కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఫలితంగా వరి కోతలు వాయిదా వేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని మరో వైపు వాతావరణం మేఘావృతమై భయపెడుతోందని రైతులు అన్నారు.

తగ్గుతున్న కూలీల సంఖ్య

గతంలో పొలం పనులు చేసేందుకు గ్రామ స్తులు అధికంగా ఉండేవారు క్రమంగా వ్యవసాయ పనులకు వచ్చేవారి సంఖ్య తగ్గుతోంది. గతంలో వ్యవసాయ పనులు చేసేందుకు బంటా మేస్త్రీలు ఉండి కూలీల జట్లు నడిపేవారు. మేస్త్రీ వ్యవస్థ పూర్తిగా కనుమరుగైంది

అధిక కూలీ రేట్లతో రైతుపై భారం

దిగుబడులు కూడా అంతంతమాత్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో కూలీ రేట్లు పెట్టుబడులు పెరగడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. కూలీలకు అధిక ధరలు చెల్లించడం వల్ల వారిపై అధిక భారం పడనుంది. ప్రస్తుత సార్వాలో ఎకరం చేను కోత కోయడానికి రూ.7 వేలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ట్రాక్టర్లతో మాసూళ్లు చేసేందుకు మరో రూ.3 వేలు అవుతుంది. కూలిరేట్లు పెరగడంవల్ల ఎకరానికి అదనపు వ్యయం అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మరోపక్క ఆరుదల లేదంటూ వ్యాపారులు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల నష్టపోయే పరిస్థితులున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతుల నుంచి ధాన్యం చేయి దాటిపోయిన తరువాత ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటిస్తోంది. ప్రస్తుత సార్వాలో ఎకరానికి ఇప్పటికే సుమారు రూ. 25వేల వరకూ పెట్టుబడి పెట్టినట్టు రైతులు చెప్పారు. కౌలు రైతులు ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు ఏం చేయాలో పాలుపోని స్థితిని ఎదుర్కొంటున్నారు. వరి కోతల కోసం రైతులకు ఉచితంగా ఆధునిక యంత్రాలను అధిక సంఖ్యలో ప్రభుత్వం అందుబాటులో ఉంచాలని తద్వారా సకా లంలో వరి మాసూళ్లు పూర్తయ్యి రైతులకు మేలు జరుగుతుందని రైతు పులగం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకం వర్తింజేస్తే రైతులకు ఆర్థికంగా భారం తగ్గుతుందని రాట్నాలకుంటకు చెందిన రైతు గరికి ముక్కు జ్ఞానేసు అన్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్ట్‌షాపులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానం అమలవుతున్న నాటి నుంచి గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చవిడిగా నిర్వహిస్తున్నారు. పెదవేగి మండలం బి శింగవరం ప్రధాన కూడలిలో యథేచ్ఛగా బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసి పగలూ, రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. ఈ చిన్న గ్రామంలో నాలుగు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మద్యం అమ్మకాలపై అధికారులకు సమాచారం అందిస్తుంటే ఫోన్ చేసిన వారి వివరాలను లీక్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అధికారపార్టీ నాయకులు, మద్యం సిండికేట్ వారు నేరుగా ఫిర్యాదు చేసిన వారి ఇళ్లకు వచ్చి రాద్ధాంతం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వాటికి ఇకనైనా స్వస్తి పలికితే గ్రామంలో శాంతిభద్రతలు నెలకొంటాయని, లేకుంటే చూస్తూ ఉరుకోబోమని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

సమాజ హితాన్ని కోరే కవులు అభినందనీయులు

భీమడోలు: సమాజ హితాన్ని కోరే కవి పండితులు అభినందనీయులని పలువురు వక్తలు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం, పండిత చర్చా గోష్ఠి నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అధ్యక్ష వహించారు. కవి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ జటావల్లభుల సాయిరామ్, రిటైర్ టీచర్ చందూరి సీతా రామ సూర్యప్రకాష్ పాల్గొని కవిత్వ మాధుర్యాన్ని విద్యార్థులకు, పాఠకులకు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పాల్గొన్నారు. పూళ్ల శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా వీపీఎస్ ప్రభాకరరావు వ్యవహరించారు. గుండుగొలను శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటల పోటీలను నిర్వహించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

దెందులూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని యువత విధిగా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు అన్నారు. గ్రంథపాలకుడు ముళ్లపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కవి సమ్మేళనం, సాంస్కృతిక రంగ విశిష్టతలను వివరించారు. గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.